క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు బుధవారం సఖినేటిపల్లిలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన సూర్యనారాయణ, నరేంద్ర, సత్యనారాయణ, రాములుకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పార్టీ కండువాలు వేసి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన రాజా, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు చల్లా నాగరాజు, ముత్యాల నాని, నడింపల్లి వెంకట సుబ్బరాజు, వాడపల్లి రాజబాబు పాల్గొన్నారు.

సువాసిని నోముతో సౌభాగ్యం

అంబాజీపేట: మహిళలు సువాసిని నోము ఆచరించడం వల్ల మహిళల సౌభాగ్యాన్ని పెంచుతుందని ప్రముఖ వేద పండితుడు మండా లక్ష్మీ నరసింహమూర్తి అన్నారు. మండలంలోని గంగలకుర్రు అగ్రహారంలో గ్రంధి బాలాజీరావు, విశాలాక్షి దంపతులు సువాసిని నోమును బుధవారం ఆచరించారు. కార్యక్రమంలో భాగంగా లలితా సహస్ర నామాలతో ముత్తైదువలకు పాదపూజ నిర్వహించి వస్త్రదానం చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంధి మాణిక్యాలరావు, నీరజ దంపతులు, కడించర్ల శ్రీనివాసరావు, అన్నపూర్ణ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్న సమారాధన

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన లక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయ 29వ వార్షికోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా బుధవారం భక్తులకు భారీ అన్న సమారాధన చేశారు. ఆలయ అర్చకులు వాడపల్లి రాంబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దాతల సాయంతో మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అడ్డగళ్ల నారాయణమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు: మండలంలోని మూడు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. పాశర్లపూడిబాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. 216వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెండు మట్టి లారీల స్వాధీనం

పి.గన్నవరం: మండలంలోని పెదకందాలపాలెం ర్యాంపు నుంచి బుధవారం తువ్వ మట్టిని తరలిస్తున్న రెండు లారీలను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకుని తమకు అప్పగించినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. వీటికి అనుమతులు ఉన్నాయా, లేదా అని తహసీల్దార్‌ను వివరణ కోరిన అనంతరం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

అంబాజీపేట: రాష్ట్ర చరిత్రలో విద్యారంగంలో ఎవరూ చేయని విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో కెమిస్ట్రీ ల్యాబ్, అదనపు భవనానికి, వాలీబాల్ కోర్టుకు హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా నిధులు రూ.లక్షతో వాలీబాల్ కోర్టును, రూ.14 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్, అదనపు భవనాన్ని నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, జిల్లా రైతు విభాగ కార్యదర్శి కొర్లపాటి కోటబాబు, విత్తనాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండ్

రాజోలు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. బుధవారం పాలగుమ్మిలో ఏపీఎంలు కట్టా సత్యవతి, మధుర సత్యకుమారిల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. కేవలం 20 సెంట్లు భూమిలో వివిధ రకాల పంటలను ఉత్పత్తి చేయడంపై రైతులను అభినందించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యవంతం కావడంతో మార్కెట్‌లో వీటికి గిరాకీ బాగా ఉందన్నారు. మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్, ఏఓ శ్రీనివాసరావు, జెడ్‌బీఎన్ఎఫ్ అధికారి మట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- పలు గ్రామాల మహిళలతో ఆత్మీయ సభ
- ఆసరాతో మహిళల కళ్లల్లో ఆనందం



రావులపాలెంలో మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: రాజకీయాలతో సంబంధం లేకుండా తన పర అనే తేడా లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం రావులపాలెంలోని పంచాయతీ పార్కు వద్ద ఊబలంక, కొమరాజులంక, రావులపాడు, వెదిరేశ్వరం, లక్ష్మీపోలవరం గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలతో ఆత్మీయ సభ, నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు విడతల వైఎస్సార్ ఆసరా ద్వారా డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ.219.60 కోట్ల లబ్ధి చేకూర్చినట్టు తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు మంజూరైన ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆడపడుచులకు విందు ఏర్పాటు చేసి, లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందజేసి జగ్గిరెడ్డి వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం జగ్గిరెడ్డి మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమం చూసి ఇంతకు మించి మనం ఏం చెయ్యగలం అని టీడీపీ వాళ్లు భయపడుతున్నారన్నారు. ప్రతి గడపకు తిరిగి మేము అందించిన సంక్షేమం గురించి వివరించి, కరపత్రం అందజేశామన్నారు. కానీ టీడీపీ గతంలో ఏం చేసిందో వాళ్ల నాయకులకి కూడా తెలీదని, ఇచ్చిన హామీల మేనిఫెస్టోని ఇంటర్నెట్ నుంచి తొలగించుకున్న నీచ చరిత్ర వాళ్లదన్నారు. మరలా ప్రజలను మోసం చేయడానికి బూటకపు హామీలతో బయలుదేరారని ఎద్దేవా చేశారు. నిజాన్ని గ్రహించి ప్రజలంతా జగనన్నకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే ఇళ్ల స్థలాలు



ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: రాష్ట్రంలో ప్రతి ఒక్క పేదవాడి సొంతింటి కల నెరవేర్చేందుకే పార్టీ, మతం, కులంతో సంబంధం లేకుండా అర్హత ఉన్న అందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినట్టు వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా జెడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం క్రాప, శంకరాయగూడెం గ్రామాలకు చెందిన అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీని ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి అధ్యక్షతన జరగ్గా ముఖ్యఅతిథులుగా విప్పర్తి వేణుగోపాలరావు, కొండేటి చిట్టిబాబు హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. పేదలను కష్టాల నుంచి బయటకు తెచ్చేందుకు ఏదైనా చేస్తారన్నారు. రాష్ట్రం నిధుల కొరత ఉన్న కరోనా, ప్రకృతి విపత్తులు వచ్చినా ఎక్కడా ఆగకుండా పేదలకు నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలను చేరవేర్చారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే మరలా సీఎం జగన్ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం 96 మందికి ఇళ్లపట్టాలు అందజేశారు. కార్యక్రమంలో డీటీ అశోక్, సర్పంచులు బొక్కా కామేశ్వరరావు, బొబ్బిలి సీతాదేవి, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుత్తుల శ్రీరామ్మూర్తి, వైస్ సర్పంచులు గంజిపేరయ్యనాయుడు, మట్టపర్తి వీరస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో గాయపడి చేయి, కాలు విరిగిపోవడంతో కుటుంబ పోషణ లేక ఇబ్బంది పడుతున్న బాధితులకు బుధవారం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేలు నగదు, రూ.1500 విలువైన కిరాణా, 25 కేజీల బియ్యం బస్తా అందజేశారు. ఒడిశాకి చెందిన సునీతదేవి తన భర్తతో వలస వచ్చి రావులపాలెం మండలం గోపాలపురంలో నివాసం ఉంటూ భార్యభర్తలు ఇద్దరు పనికి వెళుతు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రైస్ మిల్లులో పనిచేస్తుండగా సునీత దేవి ప్రమాదవశాత్తూ పడిపోవడంతో చెయ్యి, కాలు విరిగిపోయాయి. రైస్ మిల్లు ఓనర్ ఆమెకు ఆపరేషన్ చేయించారు. ఆమెకు ముగ్గురు పిల్లలు, ఒక పిల్లాడు మానసిక వికలాంగుడు, అద్దె ఇంట్లో ఉంటున్నారు. భర్త కూడా వికలాంగుడు దీంతో పనికి వెళ్లలేకపోవడంతో కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది. దీంతో సాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణ దేవి సేవా సభ్యులను కోరాగా పై మేరకు సాయం అందించినట్టు సభ్యులు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

కొత్తపేట: మండలంలోని శనైశ్వర స్వామివారి దేవస్థానం క్షేత్ర పాలకుడు రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఏసీ, ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారిని, అమ్మవార్లకు కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రదానోత్సవం నుంచి తలంబ్రాల వరకూ కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు, ప్రత్యేకంగా విచ్చేసిన వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో మందపల్లి సర్పంచ్ సాదు వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు సాదు చెంచయ్య, అడపా వెంకటేశ్వరరావు, కుంపట్ల నాగలక్ష్మి, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు పునః ప్రతిష్ఠ

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పోలమ్మ అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ఊరేగింపు, గ్రామోత్సవం వైభవంగా జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారి పునః ప్రతిష్ఠ గురువారం ఉదయం 11.53 గంటలకు జరుగుతుందని ఆలయ పునః నిర్మాణ సారథి యెరుబండి శ్రీరామమూర్తి తెలిపారు.

అన్నసమారాధన

అంబాజీపేట: మాచవరం శివారు కోటివారి అగ్రహారంలో కొలువుదీరిన భువనేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం భారీ అన్నసమారాధన చేపట్టారు. అంతకు ముందు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లక్ష పసుపు కొమ్ముల నోము

మామిడికుదురు: లూటుకుర్రులోని గోకవరపు సూర్యకుమారి కల్యాణ మంటపంలో బుధవారం గరిసె ధాన్యం, లక్ష పసుపు కొమ్ములు, తులసి మొక్కలు, గోదానం పూజ ఘనంగా జరిగింది. పలువురు మహిళలు ఈ పూజల్లో పాల్గొని పసుపు కొమ్ములు, తులసి మొక్కలను వాయనంగా అందుకున్నారు. ఆకే వెంకటేశ్వరరావు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో భారీగా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

కిడ్నీ బాధిత మహిళకు సాయం



మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామానికి చెందిన మామిడిశెట్టి భారతి కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ మహిళ మూడు రోజులకోసారి డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి. భర్త ఆటో డ్రైవర్, వారికి ఇద్దరు అమ్మాయిలు. రెక్కాడితే కాని డొక్కాడని ఆ కుటుంబానికి రాజోలు తాలూకా శెట్టిబలిజ యువజన సంక్షేమ సంఘం బుధవారం రూ.50 వేల ఆర్థికసాయం అందించింది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్న లక్ష్యంతో సహాయం అందించామని సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పితాని సురేంద్ర, మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు, సత్రం చైర్మన్ వాసంశెట్టి రామకృష్ణ, పాటి గోవిందరావు, కాండ్రేగుల పూర్ణ, నాగబాబు, సురేంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఖండ్రిగలో రోడ్డు శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: అభివృద్ధి, రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని ఖండ్రిగ నుంచి రేవడి కాలువ వరకూ గల పీఆర్ రోడ్డును రూ.70 లక్షలతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చాలనే సంకల్పంతో నవరత్నాలతో పాటు అనేక వినూత్న పథకాలను అమలు చేస్తూ మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దానిలో భాగంగా నియోజకవర్గంలో దాదాపు అన్ని ఆర్ అండ్‌బీ రోడ్లు ఆధునీకరించుకున్నామన్నారు. అయితే పీఆర్ పరిధిలోని రోడ్లకు టెండర్లు పడని పరిస్థితుల్లో మన నియోజకవర్గంలో పలు రోడ్ల నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిధులు మంజూరు చేయించుకోవడంతో పాటు టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాటిలో ఈ ఖండ్రిగ రేవడి రోడ్డు ఒకటన్నారు. ఎవరి హయాంలో, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరిగాయో గుర్తించడం ద్వారా రాబోయే రోజుల్లో అందరూ వైఎస్సార్ సీపీకి కలసిరావాలని కోరారు. అనంతరం పలువురు స్థానిక రైతులను సత్కరించారు.

రామాలయం ప్రారంభం

అవిడి పెద్ద చెరువుగట్టు ప్రాంతంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో ఆధునీకరించిన రామాలయాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో పలు ప్రసిద్ధ దేవాలయాల అభివృద్ధికి దేవదాయ శాఖ నుంచి సుమారు రూ.10 కోట్లు విడుదల చేయించామన్నారు. 44 దేవాలయాల అభివృద్ధికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.4.44 కోట్లు తీసుకువచ్చామన్నారు. మరో 44 ఆలయాల ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, దూనబోయిన నవదీప, ఎంపీటీసీలు పితాని లక్ష్మీతులసి, దూళి సూరిబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, రామాలయం కమిటీ ప్రెసిడెంట్ పరమట సూర్యప్రకాశరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు బొక్కా సత్యనారాయణ, యడ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి



విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విమాన వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతిష్ఠా కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మేడపాటి సిద్ధార్థరెడ్డి–అన్వితరెడ్డి దంపతులతో ఘనంగా నిర్వహించారు. వారు స్వామికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలి

కొత్తపేట: గ్రామాల్లో చేపట్టిన, చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు గ్రామ కార్యదర్శులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కందుల వాణి అధ్యక్షతన గ్రామ సచివాలయాల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ గంగాధరరావు వివిధ అంశాలపై సమీక్షించారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందన్న సంకేతాల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైతే అందరూ ఎన్నికల విధుల్లో బిజీ అయిపోతారని, ఈలోపు అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రావులపాలెంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. వలంటీర్లు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని సూచించారు. సమావేశంలో మండల పరిషత్ ఏఓ కృష్ణారెడ్డి, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



మామిడికుదురులో తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తున్న విద్యార్థులు

పి.గన్నవరం: మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాతృ భాష తల్లిలాంటిదని హెచ్‌ఎం అన్నారు. మాతృ భాష ప్రాముఖ్యతను ఆయన వివరించారు. విద్యార్థులు గేయాలు, నృత్యాలతో అలరించారు. ఉపాధ్యాయులు బి.మల్లికార్జున్‌రావు, మహ్మద్, గిడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం మామిడికుదురు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు తెలుగు భాష ప్రాముఖ్యతను వివరిస్తూ పాటలు పాడారు. నృత్యాలు చేశారు. మాతృ భాష ప్రాధాన్యతను వివరించే విధంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఎంతో మంది ప్రముఖ కవులు తమ రచనల ద్వారా తెలుగు భాష ప్రాముఖ్యతను ప్రపంచం నలు దిశలా చాటి చెప్పారని ఉపాధ్యాయుడు డీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



సఖినేటిపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



అంబాజీపేటలో వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు

రాజోలు: రాష్ట్రంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం రాజోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు మంజూరు చేసి సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ స్వచ్ఛందంగా గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలాంటి వివక్ష లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా ఎంపికలు చేపట్టి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మండల పరిధిలో 408 మందికి అవార్డులు రావడంపై వలంటీర్లు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీపీ కేతా శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు రేవు జ్యోతి, కడలి సత్యనారాయణ, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, పార్టీ నాయకులు రాపాక వెంకట్, కంచర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం రాజోలు నియోజకవర్గంలోని ఏడు గ్రామాలకు చెందిన వలంటీర్లను ఆయన సన్మానించారు. వలంటీర్లకు వందనం సభలో ఇద్దరికి సేవా వజ్ర, ఇద్దరికి సేవారత్న, 119 మందికి సేవామిత్ర అవార్డులు అందించారు. వారికి పతకాలు అందించి, శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మానస పుత్రికలన్నారు. జగన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలని సూచించారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పీఏసీఎస్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఎంపీటీసీలు నయినాల సీతామహలక్ష్మి, వర్ధినేని రాము, పార్టీ నేతలు సూరిశెట్టి బాబి, చేట్ల సత్యనారాయణ, కంచి శ్రీరామ్, నయినాల రామకృష్ణ, పినిశెట్టి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలు ఎంతో అమూల్యమైనవని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యంలో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందజేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: వలంటీర్, సచివాలయ వ్యవస్థలపై దేశంలోని పలు రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని, వీటిని దేశమంతా అమలు చేయాలని కేంద్రానికి సూచించడం గర్వకారణమని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన వలంటీర్లకు పురస్కారాల ప్రదానాన్ని బుధవారం నిర్వహించారు. ఇన్‌చార్జి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రిక అయిన వలంటీర్ వ్యవస్థ గురించి దేశమంతా మాట్లాడుకుంటోందన్నారు. వలంటీర్లు ప్రజలకు అందించే సేవలకు విలువ కట్టలేమని, కేవలం వారిని ప్రోత్సహించేందుకే ప్రభుత్వ అవార్డులు అందిస్తోందన్నారు. అనంతరం వలంటీర్లకు సేవారత్న 5, సేవావజ్ర 2, సేవామిత్ర 342 మందికి పురస్కారాలను అందించి శాలువతో సత్కరించి మెడల్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, జిల్లా రైతు విభాగ కార్యదర్శి కొర్లపాటి కోటబాబు, పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్, ఉందుర్తి నాగబాబు, మట్టపర్తి హరి, కుసుమ శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: మండలంలోని ఎంపీపీ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వలంటీర్లను ఘనంగా సత్కరించి పురస్కారాలను అందించారు. ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వలంటీర్ వ్యవస్థను రూపొందించి తద్వారా ప్రజలకు అనేక సంక్షేమ పథకాల బాధ్యత వారి ద్వారా లబ్ధిదారులకు అందేటట్లు చేస్తూ వారిని ప్రోత్సహించాలని ఉద్దేశంతో సేవా వజ్ర, సేవరత్న, సేవామిత్ర, మూడు విభాగాలుగా ఉత్తమ సేవలందించిన వారిని గుర్తించి వారికి నగదు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, సర్పంచ్ గడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు తోటి రాజేష్, నల్లి అంజలీదేవి, చిట్టాల శ్రీనివాస్, మేడిచర్ల వెంకట్‌రాజు, గుబ్బల గౌరీ, కె.సీతామహాలక్ష్మి, ఎంఏఎస్ చైర్మన్ నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.